



RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :308 సంపాదకులు: కలిచేటి వెంకయ్య ఆదివారం 4 అక్టోబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ – యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి

ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్

సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి

పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య

150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

**సింధూరదర్శిని:** ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి



సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150సీట్లకు మిగతా 2లో...

# వాహనదారులకు నయారా షాక్

భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు..

పెట్రోల్‌పై రూ.5 పెంచిన నయారా ఎనర్జీ

డీజిల్‌పై లీటరుకు రూ.3 పెంపు

శనివారం నుంచి అమల్లోకి కొత్త ధరలు

7,000కు పైగా బంకుల్లో ధరల పెంపు

ప్రభుత్వ రంగ బంకుల్లో మాత్రం మారని ధరలు




వాహనదారులకు నయారా ఎనర్జీ షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. పెట్రోల్‌పై లీటరుకు రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా నయారా మిగతా 2లో...

# ఆంధ్రప్రదేశ్‌కు ఐఐటీయన్ల మేధస్సు






వరల్డ్ పాన్ ఐఐటీ కౌన్సిల్‌కు వేదికగా అమరావతి

డీప్ టెక్ స్టార్టప్ ల కోసం రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ వెంచర్ ఫండ్

100 మందితో గ్లోబల్ ఐఐటీ మెంటర్ల నెట్ వర్క్

ఏపీకి టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం

పాన్ ఐఐటీ ఏపీ 2026 సదస్సులో సీఎం సమక్షంలో డిక్లరేషన్ విడుదల

క్యూ–శివ పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

2027 ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు

**విజయవాడ సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఐఐటియన్ల మేధస్సు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలతో పాటు దేశాభివృద్ధి కోసం వారంతా అనుసంధానమై నెట్వర్క్ గా ఏర్పడాలని ఆయన సూచించారు. శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ 2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడ్డాయని వ్యాఖ్యానించారు. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో పాటు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా రూ. 500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యూ–శివ పేరుతో రూపొందించిన ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన ఈ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్ ల్యాబ్‌లుగా ఉపయోగ మిగతా 2లో...

# సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం

బీసీరిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని మంత్రి నారాయణ విమర్శ




**అమరావతి సింధూరదర్శిని:** స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మిగతా 2లో...




# ఆసియా క్రీడల్లో టీమిండియాకు స్వర్ణం..

చంద్రబాబు, నారా లోకేశ్ అభినందనలు – ఆసియా గేమ్స్ 2026 క్రికెట్‌లో భారత పురుషుల జట్టుకు స్వర్ణం

ఫైనల్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం

వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని నిలబెట్టుకున్న టీమిండియా

మహిళల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో భారత్‌కు క్రికెట్‌లో డబుల్ గోల్డ్

**అమరావతి సింధూరదర్శిని:** ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించి, మరోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకుని తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని మిగతా 2లో...

# బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

రామ్మోహన్ నాయుడు

బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు

రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి

**శ్రీకాకుళం సింధూరదర్శిని:** వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి మిగతా 2లో...



# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

(మొదటిపేజీ తరువాయి)

తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు.కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

# వాహనదారులకు నయారా షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఎనర్జీకి ఉన్న 7,000కు పైగా పెట్రోల్ బంకుల్లో కొత్త ధరలు అమలవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు, ఇంధన ధరలు పెరగడంతో కొనుగోలు వ్యయం పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.ఈ ఏడాది నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచడం ఇది రెండోసారి. మార్చిలోనూ పెట్రోల్, డీజిల్‌పై ఇదే స్థాయిలో ధరలు పెంచింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అప్పట్లో ధరలు పెంచింది. ముడిచమురు ధరలు తగ్గడంతో జులైలో ఆ పెంపును వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను మార్చలేదు. దేశంలో 1.04 లక్షలకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలోనే ఉన్నాయి. ఇటీవల ప్రైవేటు ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ అమ్మకాలను తగ్గించకూడదని కేంద్రం సూచించింది. ఇదిలా ఉంటే వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అక్టోబర్‌లో రూ.62.50 మేర పెంచాయి. 19 కిలోల సిలిండర్ ధర పెరిగింది. అయితే గృహ వినియోగ ఎల్పీజీ ధరను రూ.942 వద్దే కొనసాగిస్తున్నాయి. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర కూడా పెరిగింది. లీటరుకు రూ.16 చొప్పున పెంచడంతో దేశీయ విమాన సంస్థలకు లీటర్ ఏటీఎఫ్ ధర రూ.121 నుంచి రూ.137కు చేరింది.

# ఆసియా క్రీడల్లో టీమిండియాకు స్వర్ణం..

(మొదటిపేజీ తరువాయి)

యువ జట్టు అద్భుతమైన నైపుణ్యం, సంయమనంతో కూడిన ప్రదర్శన కనబరిచి దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ చారిత్రక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "ఆసియా గేమ్స్ 2026లో పాకిస్థాన్‌ను ఓడించి స్వర్ణం గెలిచిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు. వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకోవడం అద్భుతం. ఆటగాళ్లు కనబరిచిన నైపుణ్యం యావత్ దేశం గర్వించేలా చేసింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు జట్టు సభ్యులందరినీ ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్టును అభినందించారు. "ఉత్కంఠభరిత ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించి మన ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని విజయవంతంగా నిలబెట్టుకున్న టీమిండియాకు అభినందనలు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మల ప్రత్యేక ప్రదర్శనలు ఈ ఫైనల్‌ను చిరస్మరణీయం చేశాయి," అని ఆయన అన్నారు. ఇప్పటికే మహిళల జట్టు కూడా స్వర్ణం గెలుచుకోవడంతో, ఆసియా క్రీడల్లో క్రికెట్‌లో భారత్ "డబుల్ గోల్డ్" సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రెండు విజయాలతో ఆసియా గేమ్స్ క్రీడా యవనికపై భారత కీర్తి పతాక రెపరెపలాడింది.

# బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

(మొదటిపేజీ తరువాయి)

జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

# సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

# ఆంధ్రప్రదేశ్‌కు ఐఐటీయన్ల మేధస్సు

(మొదటిపేజీ తరువాయి)



పడనున్నాయి. 4 కెల్విన్ ప్రాసెసర్ సృష్టిని కూడా సీఎం ఆవిష్కరించారు. మేడిన్ అమరావతి బ్రాండ్ సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. క్యు-శివ కంప్యూటర్ల తయారీలో కీలకంగా వ్యవహరించిన చండీగఢ్ యూనివర్సిటీ, క్యూబిట్ ఫోర్స్ ప్రతినిధులను సీఎం అభినందించారు. క్యు-శివ క్వాంటం కంప్యూటర్లను తయారు చేయడానికి అసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభ్యమవుతున్నాయని ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించారు.

### అమరావతిలో క్వాంటం ఎకోసిస్టం అభివృద్ధి

దేశంలోని 23 ఐఐటీలు ప్రపంచానికి అత్యుత్తమ మేధస్సును అందించాయని, జాతి నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని సీఎం చంద్రబాబు అన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేలా ఐఐటీయన్లు తమ మేధస్సును వినియోగించాలని కోరారు. సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడినట్లే ఇకపై అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం మాట్లాడుతుందన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి ఇప్పటికే టెస్ట్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయని సీఎం తెలిపారు. ఐబీఎం--టీసీఎస్, ఎల్అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ అమరావతి నుంచి ఆపరేట్ కానుందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు. 156 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ అందుబాటులోకి వచ్చేలోగానే అమరావతిలో క్వాంటం టెక్నాలజీకి అవసరమైన మౌలిక వసతులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను మాత్రమే కాకుండా వాటికి అవసరమైన పరికరాలను కూడా తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. భారత్, ఆంధ్రప్రదేశ్ కేవలం టెక్నాలజీ వినియోగదారులుగా కాకుండా ఉత్పత్తిదారులుగా ఎదగాలని సీఎం పిలుపునిచ్చారు. వచ్చే రెండేళ్లలో కమర్షియల్ క్వాంటం కంప్యూటర్ల ఉత్పత్తికి అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో నైపుణ్యాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఐఐటీ స్థాయి ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఆరో తరగతి నుంచే విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీనికి ఐఐటీల సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు.

### మంచి ఆలోచన ఆచరణలో పెడితే విప్లవం

వినూత్న ఆలోచనలకు తాను ఎప్పుడూ ప్రాధాన్యమిస్తారని సీఎం చెప్పారు. రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను రతనాల సీమగా మార్చాలనే ఆలోచన నుంచే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటైందని తెలిపారు. ఇప్పుడు ఈ హబ్ ద్వారా రాయలసీమలో విప్లవాత్మకమైన అభివృద్ధి వస్తుందన్నారు. 20 రకాల ఫలాలు ఉత్పత్తి అవుతున్న రాయలసీమను సమర్థవంతమైన నీటి నిర్వహణ, ఆధునిక సాంకేతికతతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రిలయన్స్ సంస్థ సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. దేశంలో కోటి మంది ఏఐ నిపుణులను తయారు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఏపీ నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని సీఎం వెల్లడించారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా చేరుకోవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

### పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ డిక్లరేషన్

సమ్మిట్ లో జరిగిన సుదీర్ఘ మేథోమథనం అనంతరం పాన్ ఐఐటీ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వం ఉమ్మడిగా డిక్లరేషన్ విడుదల చేశాయి. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను అనుసంధానం చేసే వేదికగా ఈ కౌన్సిల్ పని చేయనుంది. దేశంలోని 23 ఐఐటీల నుంచి వచ్చిన సుమారు 5 లక్షల మంది ఐఐటీయన్ల మేధస్సును ఏపీ అభివృద్ధికి వినియోగించుకునేలా ఈ నెట్‌వర్క్‌ను తీర్చిదిద్దనున్నారు. డీప్‌టెక్ అభివృద్ధికి పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్ నోడల్ సంస్థగా పనిచేయనుంది. 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి సాంకేతికతలను గుర్తించి వాటిని ఆంధ్రప్రదేశ్‌లోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిస్టంతో అనుసంధానం చేసి పరిశోధన, ఫ్యాకల్టీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు 10 ఇండస్ట్రీ చాప్టర్లను ఏర్పాటు చేసి పరిశోధన, నైపుణ్యాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ఏపీ స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్, హెల్త్, అగ్రిటెక్, బ్లూ వాటర్ ఎకానమీ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీ కింద చర్యలు చేపట్టనున్నారు. రూ.500 కోట్ల వెంచర్ ఫండ్‌ను డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, కొత్త టెక్నాలజీలకు పెట్టుబడులుగా వినియోగించనున్నారు.

### వివిధ రంగాలపై ప్యానెల్ డిస్కషన్లు

రెండు రోజుల పాటు జరిగిన పాన్ ఐఐటీ సదస్సులో ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ తిరుపతి, ఐఐటీ జమ్మూ, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ధన్‌బాద్, ఐఐటీ వారణాసి, ఐఐటీ భువనేశ్వర్ తదితర సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఐఐటీల సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులతో రెండు రోజు సదస్సులో సీఎం సమావేశమై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, టెక్నాలజీ బదిలీ, పట్టణీకరణలో డీప్‌టెక్ వినియోగం, స్టార్టప్‌లు, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఏడాది పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించి వివిధ అంశాలపై చర్చించాలని సీఎం ప్రతిపాదించారు. అంతకుముందు ఇంధనం, స్వర్ణాంధ్ర, నిత్య జీవితంలో డీప్ టెక్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, అందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలు, అగ్రిటెక్-రైతులు, నీటిభద్రత తదితర అంశాలపై పాన్ ఐఐటీ సదస్సులో చర్చలు జరిగాయి. పాన్ ఐఐటీ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం ఆసక్తిగా తిలకించారు.





# శ్రీసిటీలోని టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్'లో బాయిలర్ పేలుడు

**ఐదుగురు మృతి - బాధితులకు ఒక్కొకరికి రూ.50 లక్షల నష్ట పరిహారం**

**ప్రమాద ఘటన పై విచారణకు ఆదేశం**

**జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**

శ్రీ సిటీ (సింధూర దర్శిని) 3 అక్టోబర్ తిరుపతి జిల్లా ; శ్రీసిటీ పరిధిలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్' పరిశ్రమలో శనివారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఆకస్మిక పేలుడు సంభవించడంతో దురదృష్టవశాత్తు 5 మంది మరణించారని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శ్రీ సిటీ పరిధిలో గల విదేశీ ఎగుమతులు చేపట్టే ఔషధాల తయారీ పరిశ్రమలోని 2టన్నుల సామర్థ్యం గల బాయిలర్ ఆకస్మికంగా పేలిపోవడంతో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. పేలుడు ధాటికి బాయిలర్ వద్ద పనిచేస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, ఎగసిపడిన శిథిలాలు తగలడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ సిబ్బందితో పాటు మరో ఇద్దరు కార్మికులు ఉన్నారన్నారు. మరణించిన వారిలో ఒకరు కోల్‌కతా, ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు స్థానికంగా చెర్వి, తడ ప్రాంతాలకు చెందినవారన్నారు. ప్రమాదంలో మరెవరికీ గాయాలు కాలేదన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వెంటనే స్పందించి, బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, సహాయ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. ?సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తో కలసి ఇతర అధికారులు ఉదయం 10:00 - 10:30 గంటల మధ్యలోనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిందని, దహన సంస్కారాల కోసం శ్రీసిటీ యజమాన్యం తగిన ఏర్పాట్లు చేస్తోందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం రాబోయే 2 రోజుల్లో అందజేయడం జరుగుతుందన్నారు. మృతుల పిల్లల ఉన్నత చదువులతో సహా అన్ని విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యమే భరిస్తుందన్నారు. అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో తక్షణమే ఉద్యోగావకాశం కల్పిస్తారన్నారు. బాధ్యులపై ప్రిలిమినరీ కేస్ నమోదు చేయడంతో పాటు బాయిలర్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్ మరియు పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విచారణ అనంతరం నిర్లక్ష్యానికి కారణమైన వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత 18 ఏళ్లలో శ్రీసిటీలో ఇటువంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారను, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో వెంటనే థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేందర్ రెడ్డి, శ్రీ సిటీ ఎండి రవి అన్నా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు అండగా ఉందాం.. భవిష్యత్తుకు ధైర్యాన్నిద్దాం



## రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ

రాజమహేంద్రవరం సింధూర దర్శిని దివ్యాంగులకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు ధైర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని వి. కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంయుక్తంగా శిబిరాన్ని ప్రారంభించారు.

### నాలుగు రకాల సహాయ పరికరాలు

కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల నుంచి బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ కోసం నమోదు ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారుల అవసరాలను పరిశీలించి, అర్హతకు అనుగుణంగా పరికరాలను అందజేస్తామని అధికారులు తెలిపారు. మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ.. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి ఉపయోగపడేలా సీఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి గెయిల్ సంస్థ నుంచి సీఎస్ఆర్ నిధులు సమకూర్చడంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేసిన కృషిని అభినందించారు.

### ఆర్థిక ఇబ్బందులున్నా.. అభివృద్ధి ఆగదు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు పుష్కరాలకు సంబంధించిన పరిసర మున్సిపాలిటీల్లో సుమారు రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2014–19 మధ్యకాలంలో రాజమహేంద్రవరం పుష్కరాల సందర్భంగా మున్సిపల్ శాఖ ద్వారా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సుమారు రూ.1,000 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు.

### సీఎస్ఆర్‌తో మరింత ప్రజా సేవ

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారం జోడిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ ఉద్దేశంతో గెయిల్ సంస్థను సీఎస్ఆర్ నిధులు కోరగా రూ.30 లక్షలు కేటాయించిందన్నారు. ఈ నిధులతో నాలుగు రకాల సహాయ పరికరాలను అందించేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రతి అవకాశాన్ని అన్వేషిస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. పుష్కరాల ఏర్పాట్లకు ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.2వేల కోట్ల వరకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి నారాయణను కోరినట్లు తెలిపారు.

### ప్రజా సేవలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు తనవంతు బాధ్యతగా ట్రస్ట్ ద్వారా కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నగరంలో చక్కటి పార్కులు, ప్రజలకు ఉపయోగపడే సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులను సమీకరించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెయిల్ అధికారులు, గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శివ్ కుమార్, డీజీఎం హెచ్ఆర్ డి.వి. ప్రభాకర్, జీఎం పోతయ్య, ఇతర అధికారులు నీలం ముఖర్జీ, శాంతి సాగర్, అధిక సంఖ్యలో దివ్యాంగులు, ఇతర ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# కాలుష్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

## రైస్ మిల్లుల యజమానులకు కాలుష్య నియంత్రణ మండలి ఈ .ఈ అశోక్ కుమార్



నెల్లూరు (సింధూర దర్శిని) 3 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; జిల్లాలోని నెల్లూరు నగర పరిధిలోని 64 రైస్ మిల్లుల యజమానులు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా మిల్లులను నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అశోక్ కుమార్ సూచించారు. నెల్లూరులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శనివారం మిల్లుల యజమానులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కాలుష్యాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్యల సూచనల మేరకు ఈ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని.. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా నిర్వహించుకోవాలని చెప్పడమే తమ ఉద్దేశమన్నారు. నెల్లూరు నగర పరిధిలోని రైస్ మిల్లులు వెలువరిస్తున్న కాలుష్యం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు ప్రాంతీయ కార్యాలయ అధికారులు 64 రైస్ మిల్లులను ప్రత్యక్షంగా పరిశీలించి కాలుష్యం వెలువడకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న యంత్రాలను బిగించుకోవాలని పలు మార్లు సూచించారు. 33 మంది మిల్లుల యజమానులు మాత్రమే వీటికి స్పందించి బాయిలర్ల నుంచి వచ్చే. దుమ్మును అరికట్టే యంత్రాలను బింగించు కున్నారన్నారు. 31 మిల్లుల యజమానులు కూడా కాలుష్య ప్రమాణాలను పాటించే చర్యలను చేపట్టాలని అశోక్ కుమార్ సూచించారు. బాయిలర్ల నుంచి వెలువడే దుమ్ము ను నివారించేందుకు అవసరమైన పరికరాలు బిగించే వరకూ బాయిలర్ లను నడపవద్దని సూచించారు. అయినా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మిల్లులకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా జరిమానా విధించనున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంకేతిక పరికరాల వినియోగం. .. వాటి నిర్వహణపై త్వరలోనే ఒక వర్క్ షాప్ ను కూడా నిర్వహిస్తామన్నారు. బాయిలర్లతోపాటు ఇతర యంత్రాల నిర్వహణపై ఉద్యోగులకు నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి మిల్లులో కూడా గ్రీన్ బెల్ట్ ను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని యజమానులు గుర్తుంచుకోవాలన్నారు. మిల్లులో నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయవచ్చన్నారు. ఏయే ఉత్పత్తులు తయారు చేయవచ్చనే అంశంపై కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. కాలుష్య నియంత్రణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉందని..ఈ విషయంపై అందరూ కూడా దృష్టి సారించాలని అశోక్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు యజమానులు లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగయ్య నాయుడు.. నాయకులు సుబ్రమణ్యం రెడ్డి.. కోటేశ్వరరావు. పలువురు మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

# వీరవాసరంలో నూతన వస్త్ర దుకాణం ప్రారంభించిన చినిమిల్లి వెంకట్రాయుడు

భీమవరం సింధూరదర్శిని: వీరవాసరం మండలం నౌడూరు సెంటర్ కొణితివాడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ కింగ్ ఆఫ్ ఫ్యాషన్స్' వస్త్ర దుకాణాన్ని ఎంఎల్‌సీ కావూరు శ్రీనివాస్, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకటరాయుడు శనివారం ప్రారంభించారు. దుకాణ నిర్వాహకులు కాండ్రేగుల శ్రీను, వెలక్కయల బాలాజీకి శుభాకాంక్షలు తెలిపి వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం మండల అధ్యక్షుడు చావకుల సత్యనారాయణ, భీమవరం మండల



అధ్యక్షుడు జిల్లా కొండయ్య, పట్టణ అధ్యక్షుడు గాడిరాజు రామరాజు, కమన నాగేశ్వరరావు, శ్రీనివాస్ రాజు, మాజీ జడ్పీటీసీ మానుకొండ ప్రదీప్, చికిలి మంగతాయారు, అల్లూరి రవిరాజు, కోడె యుగేంధర్, బొల్లెంపల్లి శ్రీనివాస్ చౌదరి, చిగుపాటి సందీప్, డీవీడీ ప్రసాద్, యరకరాజు ఉమాశంకర్, వీరవల్లి ప్రవీణ్, పిల్లి నర్సింహమూర్తి, కనుమూరి విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు. మండల, గ్రామ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గూడూరు నూతన డిఎస్పీగా నరసింహమూర్తి బాధ్యతలు



గూడూరు( సింధూర దర్శిని) 3 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైవే పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు పటిష్టం చేస్తామని రాబోయే ఆంజనేయస్వామి జెండా ఉత్సవంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని గూడూరు నూతన డిఎస్పి నరసింహమూర్తి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో నూతన డిఎస్పీగా శ్రీకాళహస్తి నుండి బదిలీ అయిన నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు. వేద పండితులు పూజ నిర్వహించి ఆశీర్వాదాలు అందించారు. పలువురు ఎస్సైలు, సిఐలు డిఎస్పి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీగా నరసింహామూర్తి బాధ్యతలు స్వీకరించి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని తెలియజేశారని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. హైవేపై ఎక్కువగా ప్రమాదాల జరిగే ప్రదేశాలను గుర్తించి భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తామని అన్నారు. రాబోయే ఆంజనేయస్వామి జెండా ఉత్సవంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని కోరారు. దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేస్తామని సీసీ కెమెరాలు పరిశీలించి మరమ్మత్తుల గురైన వాటిని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు శాంతిభద్రతల పరిరక్షణ కు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

# పి.జి.ఆర్.ఎస్. అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి, పి.జి.ఆర్.ఎస్. నోడల్ అధికారి విజయకుమార్



నెల్లూరు (సింధూర దర్శిని) 3 అక్టోబర్ నెల్లూరు జిల్లా; ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) ద్వారా అందిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి, పి.జి.ఆర్.ఎస్. నోడల్ అధికారి విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తమ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలతో పాటు, నేరుగా అందిన అర్జీలను కూడా ప్రతిరోజూ పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పారదర్శకంగా పరిష్కరించడంతో పాటు, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పి.జి.ఆర్.ఎస్. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా అర్జీలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని డిఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రతిభావంత విద్యార్థికి రూ.30 వేల సాయం

## విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం: ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం సింధూరదర్శిని: ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను దాతలు ఆదుకోవడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీడీఎస్ విద్యార్థి అబ్బరాజు పవన్ కళ్యాణ్‌కు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ పేదరికం కారణంగా ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా దాతలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

శ్రీవిజ్ఞానవేదిక నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం విష్ణు కళాశాలలో బీడీఎస్ చదువుతున్న అబ్బరాజు పవన్ కళ్యాణ్‌కు దాతల సహకారంతో రూ.30 వేల సాయం అందించినట్లు తెలిపారు. ప్రముఖ భవన నిర్మాణదారుడు కోటిపల్లి నాగరాజు రూ.20 వేలు, గన్నాబత్తుల సతీష్ రూ.10 వేలు అందించినట్లు వెల్లడించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# భృగుబండ గ్రామం 33/11 సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో కన్నా



సత్తెనపల్లి సింధూరదర్శిని: సత్తెనపల్లి రూరల్ మండలం భృగు బండ గ్రామం నందు 33/11 సబ్-స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ.భృగు బండ గ్రామానికి చాలా శుభదినం. మీరందరూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రం ఈరోజు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది.గతంలో మనకు లో-వోల్టేజ్ సమస్య ఉండేది. మోటార్లు కాలిపోవడం, రైతులకు రాత్రిపూట కరెంట్ ఇబ్బందులు... ఈ సమస్యలన్నీ నా దృష్టికి వచ్చాయి. మీరు నన్ను కలిసినప్పుడల్లా మా ఊరికి ఒక సబ్-స్టేషన్ తీసుకురండి" అని అడిగేవారు. భృగుబండ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో లో-వోల్టేజ్ సమస్య శాశ్వతంగా పోతుంది.రైతు సోదరులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందుతుంది.గృహాలకు 24 గంటల వెలుగులు, పరిశ్రమలకు ఇబ్బంది లేని కరెంట్ వస్తుంది. ఇది కేవలం ఒక సబ్-స్టేషన్ కాదు, భృగు బండ అభివృద్ధికి ఒక పునాది.కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అభివృద్ధిని నమ్ముతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్రాన్ని విద్యుత్ వెలుగుల రాష్ట్రంగా చేయాలని కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే మన నియోజకవర్గంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేసాము, ఇంకా చేస్తాము.ఈ సబ్-స్టేషన్ ను ఇంత త్వరగా పూర్తి చేసిన అధికారులకు, కాంట్రాక్టర్లకు, సహకరించిన గ్రామ ప్రజలకు నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న విద్యుత్ శాఖ అధికారులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే బొల్లా





వినుకొండ సింధూరదర్శిని: రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ప్రతి వార్డుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశాలు అయ్యారు. వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, కార్యకర్తల బలం, స్థానిక సమస్యలు, ఎన్నికల సన్నద్ధతపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి వార్డులో కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. వినుకొండలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తల బలం ఉంది. ఎవరూ వెనుకడుగు వేయాల్సిన అవసరం లేదు అని మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్




నరసరావుపేట సింధూరదర్శిని: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నరసరావుపేట లో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి, వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి ,రాష్ట్రాలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వమే ఉపాధి హామీకి 90 శాతం నిధులు కేటాయించాలి ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలి వలసలు ఆపాలి ఉపాధి హామీ నిధులు వ్యవసాయానికి అనుబంధం చేయరాదు ,కుటుంబం జాబు కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రయోజనానికి విడిగా కొత్త జాబు కార్డు ఇవ్వాలి చట్టబద్ధమైన పని హక్కు కల్పించాలి జాబు కార్డు కలిగిన ప్రతి ఉపాధి హామీ కూలీకి సంవత్సరానికి ఉపాధి భృతి 12000 రూపాయలు ఇవ్వాలి పని అడిగిన 15 రోజులు లోపు పని కల్పించాలి అలా కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి చేసిన పనికి సకాలంలో డబ్బులు ఇవ్వకపోతే వడ్డీతో సహా కలిపి చెల్లించాలి ఉపాధి హామీ పనులపై ప్రతి గ్రామంలో మైకు ప్రచారం చేయాలి, గ్రామసభల్లో పనులు ఎంపిక చేసి బహిరంగంగా ,వెల్లడించాలి సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలి ,200 రోజులు పని దినాలు కల్పించాలి రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలి ,రెండు పూటలా పని దినం విధానం తీసివేయాలి ,సమ్మర్ అల్వెంట్స్ పునరుద్దించాలి ఉపాధి హామీ పనిచేసిన క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ పక్షపాతాలు ఆపాలి ,వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి వారి కుటుంబం పోషణ నిమిత్తం నెలనెలా జీతం సక్రమంగా ఇవ్వాలి ఉపాధి హామీ కూలీలకు చట్టంలో పొందుపరిచిన మెడికల్ కిట్లు మజ్జిగ తాగునీరు, పనిముట్లు గుడారాలు,అందుబాటులో , ఉండేలా చూడాలి పని ప్రదేశంలో ప్రమాదాలు ఉపాధి హామీ కూలి మరణిస్తే పది లక్షల రూపాయలు ఇవ్వాలి ,వడదెబ్బ పాలైతే మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి ,కోలుకునే వరకు ఉపాధి వేతనాలు అందించాలి అంతేకాదు కేంద్రంలో అధికారుల ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం పార్లమెంటు ఉభయ సభల్లో తనకు ఉన్న మెజార్టీఅధికారాన్ని అడ్డుపెట్టుకొని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కొత్త బిల్లు ప్రవేశపెట్ర్పతిపాదనను బిల్లు ఉపాధి హామీ చట్టాన్ని స్వభావాన్ని పూర్తిగా మార్చేసే విధంగా ముజూ వాణి ఓటుతో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదింపు చేసుకుంది పార్లమెంట్లో ప్రతిపక్షాలకు చర్చించే అవకాశం లేకుండా చేసి ఎంత హడావుడిగా తెచ్చింది ఈ బిల్లు ,గ్రామీణ పేదలు వ్యవసాయ కార్మికులు దళితులు గిరిజనులు బడుగు బలహీన వర్గాలు మహిళలు చేతి వృత్తు దారులు చిన్న సన్న కారు రైతులు హక్కులపై ప్రత్యక్షంగా దాడిగానే కాకుండా ప్రత్యక్షంగా దాడిగానే కాకుండా ఈ రాజ్యాంగం మౌలిక స్వభావం మీద మోడీ చూడాల్సిన అవసరం ఉంది ,ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు దాడిగా చూడాల్సిన అవసరం ఉంది ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక సాంస్కృతి హక్కులు కమిటీ ప్రకారం పని ఒక సార్వతీక సార్వత్రిక హక్కు హక్కు ఇది జీవించే మానవుల హక్కులు ,పునాది శతాబ్ది కాలము కమ్యూనిస్టు పార్టీలు వ్యవసాయ కార్మిక సంఘాలు వివిధ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పనైనా చూపండి తిండి అయినా పెట్టండి వలసలు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాలలో పనులు కల్పించండి అనే నినాదంతో పోరాటాలు చేసిన సందర్భంగా సాధించుకున్న ,చట్టమే ఉపాధి ,హామీ చట్టం బిజెపి ప్రభుత్వం ఒకవేళ పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి వారికి ఉన్న హక్కుగా కల్పించాలి కేంద్ర ప్రభుత్వం దీని ఆర్థిక బాధ్యతను పూర్తిగా భరించడం ద్వారా పెడలిజం సూత్రాన్ని కాపాడాలి కార్మికులు గ్రామీణ పేదలు యూనియన్లు ప్రజాస్వామ్యం శక్తులందరూ ఏకం కావాలని కష్టపడి సాధించిన హక్కులను కాలరాయరవదు ప్రభుత్వం వ్యతిరేకంగా చూడరాదని సామాజిక న్యాయం మరియు ఆర్థిక భద్రతగా మూల స్తంభాలైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హామీ పథకం పునర్దించాలని వి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బి కే యం యు జిల్లా అధ్యక్షులు మరియబాబు గౌరవ అధ్యక్షులు దాసరి వరహాలు మాజీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అక్కినపల్లి బాలయ్య చౌటుపల్లి నాగేశ్వరరావు మేకల సామేలు సాల్మన్ రావు నీరుడి ఆనందు తదితరులు పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అచ్చంపేట సింధూరదర్శిని: అచ్చంపేట మండల కేంద్రంలో షేక్ రమణ(39) అనే యువతి అనారోగ్యంతో బాధపడుతు శనివారం మరణించారు...ఆర్థిక ఇబ్బందులతో పేదరికంతో ఉన్న ఆ కుటుంబానికి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకర రావు ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అచ్చంపేట టౌన్ పార్టీ అధ్యక్షుడు కమల్ సైదా,మండల బీసీ నాయకుడు మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్.కె బీరువాలు జానీ బాషా,మాజీ వార్డు సభ్యులు రాము తో కలిసి వారి కుటుంబానికి సానుభూతి తెలిపి వారి అంత్యక్రియల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు...భవిష్యత్తులోనూ వారికి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటామని తెలిపారు.

## 5న పొద్దుటూరులో జల జీవన్ మిషన్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపు

క్రోసూరు సింధూరదర్శిని: పొద్దుటూరు నియోజకవర్గంలో ఈ నెల 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్న జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు.కడప నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కడప నియోజకవర్గ శాసనసభ్యులు రెడ్డప్పగారి మాధవి రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి తో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.









## 10వ తరగతి ఫలితాల్లో వినుకొండకు స్టేట్ ఫస్ట్ రావాలి

### చదువు, క్రీడల్లో మన నియోజకవర్గం అగ్రస్థానంలో నిలవాలి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ సింధూరదర్శిని: రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో వినుకొండ నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు ఆకాంక్షించారు. శనివారం గంగినేని ఫంక్షన్ హాల్‌లో జరిగిన జెడ్పీ హైస్కూల్ నాన్-



లాంగ్వేజ్ (గణితం,పీఎస్ , ఎన్ ఎస్ , సోషల్) ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... విద్యాబోధనతో పాటు క్రీడల్లోనూ మన నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలోనే ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తుమ్మల వెంకటేష్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు



క్రోసూరు సింధూరదర్శిని: బాల ఆదిత్య డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ . విజయం ఫౌండేషన్ ట్రస్ట్, ప్రెసిడెంట్, మేదరి సంఘశీ రాష్ట్ర యువజన సంఘశీ కోశాధి కారి. వినుకొండ వార్త పల్నాడు జిల్లా రిపోర్టర్ తుమ్మల. వెంకటేష్ బాబు పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలియజేస్తున్నాము. మీరు సమాజానికి చాలా సేవ చేస్తున్నారు. చదువు మధ్యలో ఆగి ఏమి ఉద్యోగాలు లేక చాలా మంది పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వాళ్లకు మంచి సలహాలు ఇచ్చి వారి చదువుకు మార్గదర్శకంగా నిలిచారు.దూరవిద్య విధానాశీ ద్వారా చాలా. మంది పిల్లలు చదుకొని.ఉపాధి అవకాశాలు, చేస్తున్నారు.అలాగే విజయం ఫౌండేషన్ ట్రస్ట్ స్థాపించి చాలా మందికి పేదలకు, ఉచిత వైద్య శిబిరాలు. ఉచిత మందులు పంపిణీ, వృద్ధులు వికలాంగులకు మధ్యాహ్నం భోజనం వసతి వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సమాజానికి మీ వంతు కృషి గా విలేఖరి గా చాలా కార్యక్రమాలు చేశారు.అలాగే మీరు పుట్టిన మేదరి కులానికి కూడా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వినుకొండ వార్త పాత్రికేయులు మిత్రులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం



అచ్చంపేట సింధూరదర్శిని: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 వ తారీకు నుండి అక్టోబర్ 17 వ తారీకు వరకు నెల రోజులు పాటు జరిగే సేవా సంకల్ప అభయాన్ ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం అచ్చంపేట మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో ఐదు అంగన్వాడీ సెంటర్లను సందర్శించడం జరిగింది. అంగన్వాడి సెంటర్ -4 నందు అంగన్వాడి ఉత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు అంగన్వాడీ సెంటర్ల కార్యకర్తలను సన్మానించడం జరిగింది మరియు అంగన్వాడి సెంటర్లలోని సేవలను గురించి తెలుసుకొని లబ్ధిదారుల నుండి సేవలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో అచ్చంపేట బిజెపి మండల అధ్యక్షులు కొండిసెట్టి సత్యనారాయణ మరియు సేవా సంకల్ప అభయాన్ కన్వీనర్ చింతపల్లి శ్రీధర్ మరియు అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు బాలింతలు, గర్భిణీలు మహిళలు, పిల్లల తల్లిదండ్రులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో యువతి ఆత్మహత్య

పుల్లలచెరువు సింధూరదర్శిని: కుటుంబ కలహాల నేప థ్యంలో ఓ యువతి సమ్మర్ స్టోరే జ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్ప డిన విషాద ఘటన పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామంలో చోటుచేసు కుంది. స్థానికుల వివరాల ప్రకారం పల్నాడు జిల్లా దుర్గికి చెందిన బుడగ జంగాల కుటుంబానికి చెందిన పార్వతి (22) భర్త శంభు, ఇద్దరు పిల్లలతో కలిసి వ్యాపార నిమిత్తం ముటుకుల గ్రామానికి వచ్చారు. గ్రామంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని కొంతకాలంగా అక్కడే నివసిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో చోటుచేసుకున్న కలహాలతో పార్వతి మనస్తాపానికి గురైనట్లు సమాచారం. శనివారం సమ్మర్ స్టోరేజ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

# దశాబ్దాల తాగునీటి సమస్యకు చెక్..!

# రోటరీ క్లబ్ చొరవతో మాచర్ల ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్





మాచర్ల సింధూరదర్శిని: ఒకవైపు నిత్యం వేలాది మంది రాకపోకలు.. మరోవైపు రోగుల ఆర్తనాదాలు.. వారికి తోడుగా వచ్చిన బంధువుల పరుగులు.. ఇంతటి రద్దీ ఉండే మాచర్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కోసం మాత్రం ఇబ్బందులు తప్పేవి కావు. వైద్యం కోసం వచ్చిన వారికి కనీసం మంచినీరు కూడా సక్రమంగా అందని పరిస్థితిపై రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేసేవారు. తాజాగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మాచర్ల పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, రోటరీ క్లబ్ ఆఫ్ దక్కన్ హైదరాబాద్, స్థానిక కెసీపీ సిమెంట్ యూనిట్ సంయుక్త సౌజన్యంతో రూ.4 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌తో పాటు ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి వచ్చింది.

**రోజుకు వేల మంది.. నీళ్ల కోసం తిప్పలు**

పల్నాడు జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు చెందిన ప్రజలకు మాచర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం కీలక వైద్య కేంద్రంగా ఉంది. ప్రభుత్వం ఆసుపత్రిని 30 పడకల నుంచి 50 పడకల స్థాయికి అభివృద్ధి చేసింది. మాచర్ల పట్టణంతో పాటు విజయపురి సౌత్, వెల్దుర్తి, దుర్గి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. రోజుకు సుమారు 1,500 వరకు ఓపీ వస్తున్నట్లు ఆసుపత్రి వర్గాల సమాచారం. గర్భిణీలు, ప్రసవాలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, గొడవలు, వివాదాలు, కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులతో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో రోగులు వస్తుంటారు. రోగులతో పాటు వారి బంధువులు, సహాయకులు కలిపి రోజుకు 3 వేల నుంచి 5 వేల మంది వరకు ఆసుపత్రి ప్రాంగణానికి వస్తుంటారని అంచనా. ఇంతటి రద్దీ ఉన్న చోట తాగునీటి అవసరం కూడా అదే స్థాయిలో ఉంటుంది. కానీ సరిపడా నీరు అందుబాటులో లేకపోవడంతో రోగుల బంధువులు బయట నుంచి నీటి సీసాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడేది.

**రోజుకు రూ.15-20 వేల ఖర్చు చేసినా.**

ఆసుపత్రిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రోజుకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నప్పటికీ, పెద్ద సంఖ్యలో వచ్చే రోగులు, సహాయకులకు నీరు సరిపోకపోవడం సమస్యగా మారింది. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడేవి. వైద్యం కోసం వచ్చిన వారికి మందులతో పాటు మంచినీరు కూడా అవసరమే. ఈ సమస్యను గుర్తించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు, కెసీపీ సిమెంట్ యాజమాన్యం ముందుకొచ్చి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

**రూ.4 లక్షలతో శాశ్వత పరిష్కారం**

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, రోటరీ క్లబ్ ఆఫ్ దక్కన్ హైదరాబాద్, స్థానిక కెసీపీ సిమెంట్ యూనిట్ సంయుక్త సహకారంతో రూ.4 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్ కోసం ప్రత్యేక షెడ్‌ను కూడా నిర్మించారు. దీంతో ఇకపై ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండనుంది.

**ఒక చిన్న సేవ.. వేల మందికి మేలు.**

ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ వేలాది మందికి ప్రయోజనం కలగనుంది. చిన్న సేవా కార్యక్రమంగా కనిపించినప్పటికీ.. నిత్యం వేల మంది రాకపోకలు సాగించే ఆసుపత్రిలో దీని అవసరం మాత్రం ఎంతో పెద్దది.

**ఘనంగా ప్రారంభోత్సవం**

నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్‌వలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కెసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ ఆఫ్ దక్కన్ హైదరాబాద్ డేర్ ప్రాజెక్ట్ సభ్యులు, మాజీ రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేపీ చారి, మెంబర్‌షిప్ ఓరియెంటెడ్ చైర్మన్ పంగులూరి విష్ణుబాబు చేతుల మీదుగా ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, మాజీ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కొండవీటి రామకోటయ్య, ప్రస్తుత వర్కింగ్ కమిటీ చైర్మన్ మాచర్ల వాసు, రోటరీ క్లబ్ సభ్యులు, కెసీపీ యాజమాన్య ప్రతినిధులు, వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సమస్యకు తెరదించుతూ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌తో ఇక రోగుల గొంతు ఎండిపోకుండా.. వైద్య సేవలతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందే అవకాశం ఏర్పడింది.

# గాంధీజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం




మాచర్ల సింధూరదర్శిని: మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, అహింస, శాంతి మార్గాలను విశ్వసించి పల్నాటి గాంధీగా పేరుగాంచిన మాజీ పార్లమెంటు సభ్యులు, రొటేరియన్ స్వర్గీయ కోట సైదయ్య స్మారకంగా గాంధీ జయంతి వేడుకలు స్థానిక కెసిపి వెలగపూడి లక్ష్మణ్ దత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయుల సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు ప్రదర్శించిన ఫ్యాన్సీ డ్రెస్‌లు, నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముందు మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, కోట సైదయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రోటరీ ఆన్స్ మహిళల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాల్లో నడిచిన గాంధీజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల్లో గాంధీజీ ఆశయాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథి కోట హనుమంతరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రూప్ డాన్స్ విభాగంలో సెంట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రథమ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ద్వితీయ, కేజీబీవీ విద్యార్థినులు తృతీయ బహుమతులు సాధించారు. సోలో విభాగంలో కిడ్స్ పాఠశాల విద్యార్థి ప్రథమ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ద్వితీయ, విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ బహుమతులు పొందగా, సెంట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు కన్సొలేషన్ బహుమతి అందుకున్నారు. "గాంధీజీ గురించి తెలుసుకో" నినాదంతో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో విజేతలైన వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు ఇక్కుర్తి శంకర్, తిర్లిక శ్రీనివాసరావు, రోటరీ ట్రస్ట్ ట్రెజరర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, కార్యదర్శి డాక్టర్ మూడవత్ దశరథ్ చౌహాన్, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, సీనియర్ రోటరీ క్లబ్ సభ్యులు, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బయ్యవరం, విప్పర్ల గ్రామాలలో పత్తి పంటల పరిశీలన

క్రోసూరు సింధూరదర్శిని: క్రోసూరు మండలంలోని బయ్యవరం మరియు విప్పర్ల గ్రామాల్లోని పత్తి పంటల ను శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయి లో పరిశీలించారు ఈ పరిశీలనలో డా. వి. మనోజ్ కుమార్ (ప్రధాన శాస్త్రవేత్త, తెగుళ్ల శాస్త్ర విభాగం), డా. ఎల్. రాజేశ్ చౌదరి (శాస్త్రవేత్త, కీటక శాస్త్రం), డా. సి. హెచ్. నాగజ్యోతి (సేద్య శాస్త్రం) మరియు పోస్ట్ గ్రాడ్యు యేట్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు రైతులకు కీలక సూచనలు చేశారు. శాస్త్రవేత్తల ప్రధాన సూచనలు మరియు నివారణోపాయాలు కాయ కుళ్ళు తెగులు నివారణ: బయ్యవరం, విప్పర్ల పరిసర ప్రాంతా లలో కాయ కుళ్ళు తెగులు ఉధృతి ఆర్థిక నష్ట శాత పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తిం చారు. దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ)0.1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ ఒక లీటరు నీటికి కలిపి, మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు బాగా తడిసేలా పిచికారీ చేయాలని వివరించారు .





**గూడ, కాయ రాలడం అదుపునకు:**

పత్తి పొలాల్లో గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే, ప్లానోఫిక్స్ (4.5% నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) ను 0.25 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున మోతాదులో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు

**పురుగు మందుల వాడకం తగ్గించండి:**

ప్రస్తుతం రసం పీల్చే పురుగులు, గులాబీ రంగు పురుగు, ఆకుమచ్చ తెగులు, మరియు టొబాకో స్ట్రీక్ వైరస్ ఉధృతి ఆర్థిక నష్ట శాతం కంటే తక్కువగానే ఉంది. కావున రైతులు అనవసరంగా పురుగు మందులు వాడకుండా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చుఅని తెలిపారు .

**లింగాకర్షక బుట్టల ఏర్పాటు:**

గులాబీ రంగు పురుగు ఉధృతిని ముందస్తుగా కనిపెట్టడానికి ఎకరానికి 10-12 లింగాకర్షక బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి అని రైతులకు వివరించారు

**బెట్ట పరిస్థితులకు ముందస్తు జాగ్రత్తలు:**

రాబోయే రోజుల్లో బెట్ట పరిస్థితులు వచ్చే అవకాశం ఏమన్నా ఉన్నట్లయితే, పంట తట్టుకోవడానికి 19:19:19 లేదా 13:0:45 ఎరువును 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తల బృందం రైతులకు సిఫార్సు చేసి అవగాహన కల్పించారు.



## నైతిక విలువలతో కూడిన సమాజ స్థాపనే ధ్యేయం

పిడుగురాళ్ల సింధూరదర్శిని: విద్యాసంస్థల ఆద్వర్యంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ సమీపంలోని కొండమోడులో నడుపబడుచున్న పిఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్స్ కోనేటి నరసింహరావు,బాడిశ మస్తాన్ రావు నిర్వహణలో ప్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ పూర్వ విద్యార్థి అరవింద్ రెడ్డి భవిష్యత్తు మంచి అవకాశాలు పొందటానికి ఉన్నత విలువలతో కూడినటువంటి వ్యక్తిత్వం కలిగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్బంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు,డ్రాన్స్ లు,స్క్రిట్ లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్బంగా కళాశాల డైరెక్టర్స్ మాట్లాడుతూ కెఎన్ఆర్ విద్యాసంస్థల ఆద్వర్యంలో ఇంటర్మీడియట్,డిగ్రీ వరకు విద్యను దీటుగా సామాన్య విద్యార్థులతో అసామాన్య ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని,నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు కనుక,విద్యార్థులను దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

## ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల పరిశీలన



క్రోసూరు సింధూరదర్శిని: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలోని విప్పర్ల, అనంతవరం గ్రామపంచాయతీల పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్లలో తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసే విధానాన్ని పంచాయతీ అభివృద్ధి అధికారులకు వివరించి, వర్మీ కంపోస్టు తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే పొడి చెత్తను స్వచ్ఛ రథం ద్వారా సేకరించి, దానికి అనుగుణంగా పొడి చెత్తను వేరు చేసి అందించే విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు.



గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు బిన్ బ్యాగ్ విధానం అమలవుతున్నదా లేదా అనే అంశాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. రాధారమణ, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ వీరాంజనేయులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## గర్భవతులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి

**అంగన్వాడి సూపర్వైజర్ పరిమళ**



అమరావతి సింధూరదర్శిని: గర్భవతులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ పరిమళ అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగాపురం గ్రామంలోని అంగన్వాడి 3 వ సెంటర్ నందు పౌష్టికాహార మసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ పరిమళ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం గురించి తెలియజేశారు. అలాగే రోజువారి ఆహారంలో గుడ్డు, పాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పులు ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ లక్ష్మి నరసమ్మ, సామ్రాజ్యం, ఎంఎల్ హెచ్పి కిరణ్మయి, అంగన్వాడీ టీచర్లు శ్రీలత, శివరాణి, శౌరిరాణి ,సత్యవేధం, ఆశా వర్కర్లు సంధ్య, సునీత, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## కెప్టెన్ స్మిత్ ఆరోగ్యంపై గుడ్‌న్యూస్.. చికిత్సకు బాగా స్పందిస్తున్న పైలట్

కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితిపై
భారత రాయబార కార్యాలయం అప్‌డేట్
చికిత్సకు స్మిత్ బాగా స్పందిస్తున్నారని వెల్లడి
ఆయన ఆరోగ్యం మెరుగవుతోందని ప్రకనటన
కుటుంబంతో రాయబార కార్యాలయం టచ్‌లో ఉందని వెల్లడి
యూఏఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన భారత్



ఫ్లైదుబాయ్ విమానంలో ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకు సాహసం చేసిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వేగంగా కోలుకుంటున్నారు. చికిత్సకు ఆయన బాగా స్పందిస్తున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం శనివారం తెలిపింది. స్మిత్‌కు ప్రస్తుతం మెరుగైన వైద్యం అందుతోంది. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోంది. స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఆయనకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్న యూఏఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో బుధవారం మరో పైలట్ స్మిత్‌పై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో విమానం ఒక్కసారిగా కిందకు దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడినప్పటికీ స్మిత్ ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్మిత్‌కు ప్రాథమిక చికిత్స అందిస్తూ విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా దించారు.
స్మిత్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రశంసించారు. స్మిత్ సాహసం ఎంతోమంది ప్రాణాలను కాపాడిందని చెప్పారు. దేశమంతా ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తోందని తెలిపారు. స్మిత్ సాహసాన్ని ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రశంసిస్తున్నారు.

## ఎస్ఐఆర్ కుట్రపూరితం.. సీఈసీ తక్షణమే వైదొలగాలి: ప్రకాశ్ రాజ్

ఎస్ఐఆర్ పై మరోసారి విమర్శలు గుప్పించిన ప్రకాశ్ రాజ్
ఇంట్లో లేని వాళ్ల ఓట్లు కూడా తొలగించారని మండిపాటు
దళితులు, ముస్లింలే టార్గెట్ అని ఆరోపణ



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్దేశపూర్వకంగానే కొందరి ఓట్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కింద దేశవ్యాప్తంగా సుమారు 13.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ముఖ్యంగా వలస కార్మికులు, దళితులు, ముస్లింల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. ఇప్పటికే ఏటా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండగా, కొత్తగా ఈ ప్రత్యేక సవరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. దేశంలో అక్రమ చొరబాటుదారులు ఉంటే, ఇన్నాళ్లూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏం చేసింది? అని నిలదీశారు. ఇంట్లో లేని వాళ్ల ఓట్లను తీసేశారని మండిపడ్డారు. ముస్లింలు, దళితుల ఓట్లను తొలగించడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు. మరోవైపు, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. జాబితాల నుంచి పొరపాటున తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# పొగ తాగకపోయినా మృత్యుఘోష..

## భారత్‌లో పాసివ్ స్మోకింగ్ విలయం

సెకండ్ హ్యాండ్ స్మోక్‌తో భారత్‌లో 3.25 లక్షల మరణాలు - 1990తో పోలిస్తే 50% పెరిగిన మృతుల సంఖ్య
చైనా తర్వాత అత్యధికంగా ప్రభావితమైన దేశం భారతే - మహిళలు, చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్న పాసివ్ స్మోకింగ్
100 శాతం పొగ రహిత ప్రాంతాలు అమలు చేయాలని నిపుణుల సూచన



సిగరెట్ తాగే వ్యక్తి వదిలిన పొగ గాలిలో కలిసిపోతుందని భావిస్తే పొరపాటే. అది పక్కనున్న వారి ఊపిరితిత్తుల్లోకి చేరి, వారి ప్రాణాలను నిశ్శబ్దంగా హరిస్తోంది. పొగ తాగే అలవాటు లేకపోయినా, ఇతరులు వదిలిన పొగను పీల్చడం (సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ లేదా పాసివ్ స్మోకింగ్) వల్ల కలిగే నష్టం ఊహించిన దానికంటే చాలా తీవ్రంగా ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ప్రతిష్ఠాత్మక 'ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, కేవలం 2023 సంవత్సరంలోనే భారత్‌లో సుమారు 3.25 లక్షల మంది ఈ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. 1990లో ఈ సంఖ్య 2.17 లక్షలుగా ఉండగా, మూడు దశాబ్దాల్లో మరణాలు దాదాపు 50 శాతం పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని 'టొబాకో ఫ్రీ ఇండియా' సంస్థ అక్టోబర్ 2న నిర్వహించిన వెబినార్‌లో ఈ ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ చర్చలో పాల్గొన్న నీతి ఆయోగ్ మాజీ సభ్యుడు డాక్టర్ వీకే పాల్ మాట్లాడుతూ, భారత్‌లో పాసివ్ స్మోకింగ్ ప్రభావంపై కీలక వివరాలు పంచుకున్నారు. 1990లో దేశ జనాభాలో 43 శాతం మంది సెకండ్ హ్యాండ్ స్మోక్‌కు గురైతే, 2023 నాటికి అది 31కి తగ్గిందని తెలిపారు. అయితే, శాతంపరంగా తగ్గుదల కనిపించినా, దేశ జనాభా భారీగా పెరగడంతో బాధితుల సంఖ్య 37.5 కోట్ల నుంచి 44.4 కోట్లకు పెరిగిపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. ప్రపంచవ్యాప్తంగా సెకండ్ హ్యాండ్ స్మోక్ వల్ల ఏటా 17 లక్షల మంది చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ నిశ్శబ్ద మహమ్మారి కారణంగా పురుషులు, మహిళలు ఇద్దరూ తీవ్రంగా నష్టపోతున్నారు. 1990లో 1,13,400 మంది మహిళలు పాసివ్ స్మోకింగ్‌తో మరణించగా, 2023 నాటికి ఆ సంఖ్య 1,56,900కు చేరింది. అదే సమయంలో పురుషుల మరణాలు 1,04,300 నుంచి 1,68,700కు పెరిగాయి. ఈ మరణాల వల్ల దేశం ఏకంగా 9.28 మిలియన్ల 'డిసెబిలిటీ-అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్స్'ను, అంటే ప్రజలు ఆరోగ్యంగా గడపాల్సిన జీవితకాలాన్ని కోల్పోయింది. ప్రపంచంలో చైనా (49.2 కోట్లు) తర్వాత అత్యధికంగా 44.4 కోట్ల మంది బాధితులతో భారత్ రెండో స్థానంలో నిలవడం సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది.

భారత్‌లో బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడాన్ని నిషేధిస్తూ చట్టం వచ్చి 18 ఏళ్లు పూర్తయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు ప్రశ్నార్థకంగానే ఉంది. ముఖ్యంగా ఇళ్లు, కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థల్లో ఈ నిబంధనలు సరిగా అమలు కాకపోవడంతో మహిళలు, చిన్నారులు తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం 100 శాతం పొగ రహిత ప్రజారోగ్య ప్రదేశాలను కఠినంగా అమలు చేయాలని, ఇళ్లలో కూడా పొగ తాగకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తపడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# చికెన్ ప్రియులకు షాక్: కిలో రూ.500కు చేరనున్న ధర

భారీగా పెరగనున్న చికెన్, గుడ్ల ధరలు - గుడ్డు రూ.25కు చేరే అవకాశం
పెట్రోల్‌లో ఇథనాల్ కోసం మొక్కజొన్న వాడకమే ప్రధాన కారణం
వర్షాభావంతో దిగుబడి తగ్గడం మరో ఆందోళన - ఆహార భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలంటున్న పౌల్ట్రీ రంగం



మాంసం ప్రియులకు, ముఖ్యంగా చికెన్ ఇష్టపడేవారికి ఇది మింగుడుపడని వార్త. రాబోయే రోజుల్లో చికెన్ ధరలు ఆకాశాన్నంటే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కిలో రూ.250గా ఉన్న చికెన్ ధర ఏకంగా రూ.400 నుంచి రూ.500కు, కోడిగుడ్డు ధర రూ.20-25కి పెరగవచ్చని పౌల్ట్రీ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అనూహ్య పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ ఇంధన విధానాలే ప్రధాన కారణమని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ కలపడాన్ని (ఇ20 లక్ష్యం) ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఇథనాల్ ఉత్పత్తి కోసం మొక్కజొన్నను భారీగా వినియోగిస్తున్నారు. దేశంలో ఇథనాల్ ఉత్పత్తిలో మొక్కజొన్న వాటా ప్రస్తుతం 37 శాతానికి చేరింది. ఇదే సమయంలో, కోళ్ల దాణాలో 55 నుంచి 60 శాతం వాటా మొక్కజొన్నదే. దీంతో ఇంధన పరిశ్రమ నుంచి, పౌల్ట్రీ పరిశ్రమ నుంచి మొక్కజొన్నకు డిమాండ్ అమాంతం పెరిగిపోయింది. ఈ పోటీ కారణంగా మొక్కజొన్న ధరలు గత కొన్నేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి. ఐదేళ్ల క్రితం కిలో రూ.14-15 ఉన్న మొక్కజొన్న ధర, ప్రస్తుతం మార్కెట్లో రూ.25-28కి చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది రూ.32 వరకు పలుకుతోంది. ఫలితంగా, పౌల్ట్రీఫీడ్ ధరలు కూడా పెరిగాయి. ఏప్రిల్‌లో కిలో రూ.25 ఉన్న ఫీడ్, సెప్టెంబర్ నాటికి రూ.30 దాటింది. పౌల్ట్రీ ఉత్పత్తి ఖర్చులో 65-70 శాతం దాణాకే పోతుండటంతో ఈ భారం నేరుగా చికెన్, గుడ్ల ధరలపై పడుతోంది. ఇప్పటికే ఇథనాల్ డిమాండ్‌తో సతమతమవుతున్న పౌల్ట్రీ రంగానికి 'ఎల్ నినో' ప్రభావం మరో పెద్ద దెబ్బగా మారింది. వర్షాభావ పరిస్థితులు, బలహీనమైన రుతుపవనాల వల్ల ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. దేశీయ మొక్కజొన్న ఉత్పత్తిలో సాధారణంగా 60 శాతం పౌల్ట్రీ రంగమే వినియోగిస్తుంది. ఇప్పుడు ఇథనాల్ పరిశ్రమ నుంచి పోటీ పెరగడం, మరోవైపు దిగుబడి తగ్గడంతో సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గత ఏడాదిలోనే గుడ్డు ధరలు 35-40 శాతం పెరిగాయి. ఫామ్ వద్దే గుడ్డు ధర రూ.6కు చేరగా, రిటైల్ మార్కెట్లో రూ.7 నుంచి రూ.9 వరకు అమ్ముతున్నారు. రానున్న శీతాకాలంలో డిమాండ్ పెరిగితే ఈ ధరలు మరింతగా పెరగడం ఖాయమని రైతులు చెబుతున్నారు. ఈ సంక్షోభం నేపథ్యంలో, ప్రభు త్వం మొక్కజొన్న ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసు కోవాలని లేదా ఇథనాల్ తయారీకి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంధన అవసరాల కన్నా దేశంలో ఆహార భద్రతకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పౌల్ట్రీపరిశ్రమవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ దేశంలోనే టాప్!

సెప్టెంబర్‌లో 9 శాతం వృద్ధి నమోదు చేసిన భాగ్యనగరం
ముంబై, ఢిల్లీ నగరాల్లో 6 శాతం మేర తగ్గిన నియామకాలు
ఏఐ, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో అత్యధికంగా పెరిగిన అవకాశాలు
అనుభవజ్ఞులకే కంపెనీల మొగ్గు, ఫ్రెషర్లకు స్వల్ప వృద్ధి



హైదరాబాద్ సింధూరదర్శిని:దేశంలోని ఇతర ప్రధాన మెట్రో నగరాల కంటే 'వైట్ కాలర్' (ఆఫీస్) ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ జాబ్ పోర్టల్ 'నౌకరి.కామ్' విడుదల చేసిన తాజా 'జాబ్‌స్పీక్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నియా మకాలు 9 శాతం వృద్ధిని సాధించాయి. ఇదే సమయంలో జాతీయస్థాయిలో నియామకాల వృద్ధి కేవలం 2 శాతంగానే నమోదవడం గమనార్హం. నౌకరి నివేదిక ప్రకారం, హైదరాబాద్ (9%) తర్వాత చెన్నై (6%), బెంగళూరు (4%), కోల్‌కతా (4%) నగరాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. పుణెలో నియామకాలు స్థిరంగా కొనసాగుతుండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్‌సీఆర్)లో ఉద్యోగ అవకాశాలు 6 శాతం మేర క్షీణించాయి. రంగాల వారీగా విశ్లేషిస్తే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) విభాగాల్లో అత్యధికంగా 20 శాతం వృద్ధి నమోదైంది.

పండుగల సీజన్ డిమాండ్, ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ నేపథ్యంలో ఆటోమొబైల్ రంగం 11 శాతం వృద్ధిని సాధించింది. అయితే, ఐటీ-సాఫ్ట్‌వేర్(-4%), ఫార్మా(-4%), హాస్పిటాలిటీ (-11%), విద్యా రంగం (-18%) వంటి కీలక రంగాల్లో నియామకాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత నియామకాల్లో కంపెనీలు అనుభవజ్ఞులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. 13-16 ఏళ్ల మధ్య అనుభవం ఉన్నవారికి డిమాండ్ 7 శాతం పెరగ్గా, ఫ్రెషర్ల నియామకాలు కేవలం ఒక శాతం మాత్రమే వృద్ధి చెందాయి. ఇక 4-7 ఏళ్ల అనుభవం ఉన్న మిడ్-లెవల్ విభాగంలో నియమకాలు 2 శాతం మేర క్షీణించాయి.

# చైనీయులు రోజూ ఖాళీ కడుపుతో అల్లం ముక్కను ఎందుకు తింటున్నారో మీకు తెలుసా ..?





















ప్రతి దేశ ప్రజలకు ప్రత్యేకమైన సంస్కృతి మరియు సంప్రదాయాలు ఉన్నాయి. అనేక దేశాల సంస్కృతి మరియు ఆచారాలు చాలా భిన్నమైనవి. ఆ వర్గంలో చైనీయులు ఉన్నారు. మనలో చాలా మందికి చైనీయుల వివిధ వింత పద్ధతుల గురించి బాగా తెలుసు. వారు వారి సంస్కృతిలో ఉనికిని కలిగి ఉన్నారు, అలాగే అన్ని రంగాలలో చైనీయులు ఎలా ఉన్నారు.

వారు చేసే ఈ రకమైన పని వారిని సజీవంగా మరియు చక్కగా ఉంచుతుంది. ఈ అలవాటులో, వారు ప్రతిరోజూ తినగలిగే అంగుళాన్ని జోడిస్తారు. ప్రతి ఉదయం ఒక చిన్న ముక్క అల్లం తినడం అలవాటు చైనీయులలో విస్తృతంగా ఉంటుంది.

ఇది వారి ఔషధంలో ఎక్కువగా ఉపయోగించే ముడి పదార్థం. మీ పెళ్ళైన జీవితం నుండి చివరి వరకు అన్ని రకాల సమస్యలకు ఉదయం ఈ ఒక్క అల్లం ముక్క మాత్రం చాలు. ఇది ఎలా సాధ్యమో ఈ పోస్ట్‌లో నేర్చుకుందాం.

### పరిశోధన ..!

అల్లంపై వేలాది పరిశోధనలు మనకు చాలా భిన్నమైన ఫలితాలను ఇచ్చాయి. అది కూడా మీరు ప్రతి ఉదయం అల్లం ముక్క తింటే శరీరంలో అద్భుతాలు జరుగుతాయి.

మొదటి ప్రయోజనం మన రోగనిరోధక శక్తిని మరింత శక్తివంతం చేయడం. అందువల్ల, మీరు ఎటువంటి వ్యాధుల బారిన పడరు.

### మెదడు సామర్థ్యానికి

మీ మెదడు ఎల్లప్పుడూ కష్టపడి పనిచేయాలనుకుంటే, ఒక అల్లం ముక్క సరిపోతుంది. ఇది మెదడు నరాలను ఆరోగ్యంగా మరియు చురుకుగా ఉంచుతుంది. అలాగే, మీ వయస్సు ఎంత ఉన్నా, మీ జ్ఞాపకశక్తి అలాగే ఉంటుంది.

### క్యాన్సర్ కణాలు

అల్లం మరియు క్యాన్సర్‌పై పరిశోధనలో అరుదైన సమాచారం వచ్చింది. అంటే, మీరు రోజూ ఉదయం 1 ముక్క అల్లం తింటే, అది క్యాన్సర్ కణాల పెరుగుదలను పూర్తిగా ఆపుతుంది.

### రక్త ప్రవాహం కోసం

ప్రతి రోజు ఉదయం 1 ముక్క అల్లంతో మీ రోజును ప్రారంభించడం వల్ల శరీరమంతా సమానమైన రక్త ప్రవాహం ఉంటుంది.

అదనంగా ఇది మగ అవయవాలకు సమతుల్య రక్త ప్రవాహాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది.

### సెక్స్ గురించి ఎలా ..?

రోజూ ఉదయం 1 ముక్క అల్లం తినడం వల్ల స్త్రీపురుషులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

ఇది మీ వైవాహిక జీవితంలో, ఎక్కువ ఆనందాన్ని సాధించడానికి మీకు సహాయపడుతుంది. అలాగే, అవయవాలను చెక్కుచెదరకుండా ఉంచండి.

### కొలెస్ట్రాల్

ఈ చెడు కొలెస్ట్రాల్ మన శరీరానికి అత్యంత విషపూరితమైనది. అల్లం వీటిని బహిష్కరించే సామర్థ్యం కలిగి ఉంటుంది. అలాగే, స్పష్టమైన కారణం లేకుండా కడుపు ఉబ్బినట్లయితే, అది కూడా తగ్గుతుంది.

### రుతు నొప్పులకు

ఈ రుతు నొప్పి స్త్రీ జీవితంలో చెత్త ప్రభావాన్ని చూపుతుంది. మహిళలు రోజూ 1 ముక్క అల్లం తింటే రుతు నొప్పి నుండి చాలా తేలికగా బయటపడవచ్చు.

### డయాబెటిస్ కోసం

ఈ అల్లం అలవాటు మన శరీరానికి ఎక్కువ ప్రయోజనాలను తెస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని కూడా తగ్గిస్తుంది. అల్లం గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

### కండరాలకు

కొద్దిగా పని చేసిన తర్వాత కూడా మీ కండరాలు చాలా అలసిపోతాయా ..? అల్లం ఈ సమస్యను పరిష్కరించే సామర్థ్యం కలిగి ఉంటుంది. రోజూ 1 ముక్క అల్లం తినడం వల్ల మీ కండరాల మంట, అలసట, కండరాల నొప్పులు తొలగిపోతాయి.

### శరీర బరువు

రోజూ అల్లం తినడం వల్ల వేగంగా బరువు తగ్గవచ్చు. ముఖ్యంగా, ఇది మన శరీరం నుండి 43 కేలరీలను కరిగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి అల్లం గొప్ప ఔషధంగా చెప్పవచ్చు.

### గ్యాస్ వేధింపు

మలబద్ధకం మరియు అపానవాయువుకు అల్లం కూడా ఒక ఔషధంగా చెప్పవచ్చు. తినేదానికి అజీర్ణం ఉన్నవారికి కూడా ఇది మంచిది. ఖాళీ కడుపుతో అల్లం తినండి.

### కీళ్ల నొప్పి

ఈ రోజుల్లో చాలా మంది కీళ్ల నొప్పులతో బాధపడుతు న్నారు. ఉమ్మడి సమస్యలు లేకుండా మంచి స్నేహితుడిగా ఉండటానికి అల్లం మీకు సహాయపడుతుంది. ఇది కీళ్ల నొప్పులను కూడా తగ్గిస్తుంది. కాబట్టి, పైన పేర్కొన్న కారణాల వల్లనే చైనీయులు రోజూ అల్లం తింటున్నారు.

# ప్రపంచ ఛాంపియన్‌కు షాక్.. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్‌కు గోల్డ్

57 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో అమన్‌కు స్వర్ణం – ప్రపంచ ఛాంపియన్‌పై 11–7 విజయం

ఈ విభాగంలో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్ – అమన్‌కు ఆసియా క్రీడల్లో రెండో పతకం

1978 తర్వాత భారత్ రెండు ఫ్రీస్టైల్ స్వర్ణాలు



ఆసియా క్రీడలు 2026లో భారత రెజ్లర్ అమన్ శెహ్రావత్ సంచలనం సృష్టించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ హాన్ చోంగ్ సాంగ్‌ను 11–7 తేడాతో ఓడించి స్వర్ణ పతకం సాధించాడు. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణం గెలిచిన తొలి భారత రెజ్లర్‌గా అమన్ చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఆసియా క్రీడల్లో భారత స్వర్ణ పతకాల సంఖ్య 20కు చేరింది. నగోయా సిటీ ఇనాయే స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ హోరాహోరీగా సాగింది. రెండో భాగంలో అమన్ 6–1 ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ఉత్తర కొరియా రెజ్లర్ పుంజుకున్నాడు. వరుస పాయింట్లతో 7–6 ఆధిక్యంలోకి వెళ్లాడు. సమయం ముగిసే దశలో అమన్ అద్భుతంగా పుంజుకున్నాడు. టేక్‌డౌన్‌తో రెండు పాయింట్లు సాధించి, ఆ తర్వాత రోల్ ద్వారా మరో రెండు పాయింట్లు దక్కించుకున్నాడు. దీంతో 11–7 ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రత్యర్థి ఆ పాయింట్లపై ఛాలెంజ్ చేసినా ఫలితం లేకపోయింది. పైగా ఒక పాయింట్ కోల్పోవడంతో అమన్ ఆధిక్యం మరింత పెరిగింది. చివరి 30 సెకన్లలో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. అమన్‌కు ఇది ఆసియా క్రీడల్లో రెండో పతకం. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో కాంస్యం సాధించిన అతడు.. ఇప్పుడు దానిని స్వర్ణంగా మార్చుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లోనూ అమన్ కాంస్య పతకం గెలిచాడు. అమన్ ఫైనల్‌కు ముందు అద్భుతంగా రాణించాడు.

తొలి రౌండ్‌లో జపాన్‌కు చెందిన యమటో ఒగావాను 20–9తో ఓడించాడు. క్వార్టర్‌ఫైనల్లో కజకిస్థాన్‌కు చెందిన నుర్దానత్ ఐతానోవ్‌పై 12–1తో విజయం సాధించాడు. సెమీఫైనల్లో తజికిస్థాన్ రెజ్లర్ అయాల్ బెలోల్యుబ్‌స్కీ చేతిలో 2–6తో వెనుకబడ్డాడు. అయితే రెండో భాగంలో ఏకంగా 12 పాయింట్లు సాధించి 14–8తో గెలిచి ఫైనల్‌కు చేరాడు. ఇదే క్రీడల్లో పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్‌లో సుజీత్ కల్కల్ కూడా స్వర్ణం సాధించాడు. తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్ మజీద్ కుదియేవ్‌ను 10–9తో ఓడించాడు. దీంతో పురుషుల ఫ్రీస్టైల్‌లో భారత్ రెండు స్వర్ణాలు గెలవడం 1978 తర్వాత ఇదే తొలిసారి.



# మహిళా అభ్యర్థి శరీరాకృతిపై స్టాలిన్ వ్యాఖ్యలు.. క్షమాపణ చెప్పాలని విజయ్ పార్టీ డిమాండ్

టీవీకే మహిళా అభ్యర్థి శరీరాకృతిపై స్టాలిన్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఇది బాడీ షేమింగ్ అంటూ అధికార టీవీకే తీవ్ర ఆగ్రహం

స్టాలిన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఎమ్మెల్యేల ఫిరాయింపుల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసిన డీఎంకే చీఫ్

ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేగా గెలిచి టీవీకేలో చేరిన సత్యభామ

తమిళనాడులో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార టీవీకే అభ్యర్థి సత్యభామను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక దళిత మహిళా అభ్యర్థిని బాడీ షేమింగ్ చేశారంటూ అధికార పార్టీ మండిపోతోంది. స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టాలిన్, అధికార టీవీకేపై హార్స్ ట్రేడింగ్ ఆరోపణలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తరఫున ధరాపురం నుంచి గెలిచిన సత్యభామ, కొద్ది వారాలకే తన పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఇప్పుడు అదే స్థానం నుంచి టీవీకే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆమె పార్టీ మార్పు వెనుక డబ్బు ప్రమేయం ఉందని ఆరోపిస్తూ స్టాలిన్ ప్రసంగించారు. “నిజానికి వ్యతిరేకంగా పనిచేసిన వారి అభ్యర్థిని ఇప్పుడు మీరంతా ‘సూట్‌కేస్–భామ’ అని పిలుస్తున్నారు. ఆమెకు ‘పల్టీ–భామ’ అని మరో పేరు కూడా ఉంది. ఆ శరీరాకృతితో ఆమె ఎలా పల్టీ కొట్టారో నాకు అర్థం కావడం లేదు” అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. సత్యభామ శరీరాకృతిపై స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలపై టీవీకే తీవ్రంగా స్పందించింది. ఇది మహిళలను, దళిత సమాజాన్ని అవమానించడమేనని ఆ పార్టీ నేత, ఆరోగ్య మంత్రి అరుణ్ రాజ్ మండిపడ్డారు. స్టాలిన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ వివాదంపై స్పందించేందుకు డీఎంకే నేతలు నిరాకరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏఐఏడీఎంకేకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో, అధికార పార్టీపై బేరసారాల ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే.

# సినిమా న్యూస్



రాజసం ఉట్టిపడే సాంప్రదాయ లుక్‌తో ఊదా రంగు చీరలో అబ్బురపరిచిన మీర్నా. దక్షిణ భారత నటి మీర్నా ఇటీవల తన హుందాతనాన్ని, సాంప్రదాయ ఆకర్షణను చాటిచెప్పే అద్భుతమైన ఫోటోల సిరీస్‌ను పంచుకున్నారు.

## ‘ది ప్యారడైజ్’ వసూళ్లే సాక్ష్యం.. రివ్యూలపై తమ్మారెడ్డి కీలక వ్యాఖ్యలు

**రివ్యూలకు, బాక్సాఫీస్ వసూళ్లకు సంబంధం లేదన్న తమ్మారెడ్డి భరద్వాజ**

**నాని నటించిన ‘ది ప్యారడైజ్’ విజయాన్ని ఉదాహరణగా ప్రస్తావన**

**మిశ్రమ స్పందన వచ్చినా రూ.150 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని వెల్లడి**



సినిమా రివ్యూలకు, బాక్సాఫీస్ కలెక్షన్లకు ప్రత్యక్ష సంబంధం ఉండదని సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన నాని పీరియడ్ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’ విజయాన్నే ఇందుకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రానికి మిశ్రమ, నెగెటివ్ రివ్యూలు వచ్చినా వసూళ్లు నిలకడగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమ్మారెడ్డి, “ది ప్యారడైజ్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ. 150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఒక్క భారత మార్కెట్లోనే రూ. 120కోట్ల వరకు రాబట్టింది. సినిమాను అధిక ధరలకు కొనుగోలు చేసిన బయ్యర్లు ప్రస్తుతం నష్టాల నుంచి బయటపడుతున్నారు. నైజాం ఏరియా డిస్ట్రిబ్యూటర్లు లాభాల్లోకి అడుగుపెట్టారు” అని వివరించారు. “రివ్యూలకు, వసూళ్లకు సంబంధం లేదని నేను మొదటి నుంచి చెబుతున్నాను. ఒకవేళ నెగెటివ్ రివ్యూల ప్రభావం నిజంగా ఉంటే, సినిమా వసూళ్లు వెంటనే పడిపోవాలి. కానీ ఈ చిత్రం రూ. 100 కోట్ల మార్కును దాటి ఇప్పటికీ నిలబడింది” అని తమ్మారెడ్డి వ్యాఖ్యానించారు. సినిమాపై ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారాలు జరిగాయని తాను భావించడం లేదని, కానీ డబ్బులిచ్చి ఒక సినిమాను దెబ్బతీయడం మాత్రం మహా పాపమని ఆయన అన్నారు. ప్రేక్షకుల ఆదరణ ఉన్నప్పుడు విమర్శలు, పైరసీ వంటివి సినిమా విజయాన్ని ఆపలేవని ఆయన అభిప్రాయపడ్డారు.

## బన్నీ-అట్లీ సినిమా పుకార్లకు చెక్ పెట్టిన ఐశ్వర్య లక్ష్మి



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం ‘రాకా’పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా క్యాస్టింగ్‌కు సంబంధించి వస్తున్న ఊహాగానాలకు నటి ఐశ్వర్య లక్ష్మి తెరదించారు. ఈ చిత్రంలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు.

గత కొన్ని రోజులుగా ‘రాకా’ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఒక కీలక పాత్రలో, ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారంటూ ప్రచారం జోరుగా సాగింది. ఈ పుకార్లపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆమె, “నేను ఆ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఆ సినిమాలో తీసుకోండి” అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె వివరణతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది.

అల్లు అర్జున్-అట్లీ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో ‘రాకా’పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో దీపికా పదుకొణె నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. వీరితో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి తారల పేర్లు కూడా పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి, అర్జున్ దాస్‌తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ సిరీస్ ‘లవ్’లో నటిస్తున్నారు. ‘పొన్నియిన్ సెల్వన్’ వంటి చిత్రాలతో ఈమె చాలా గుర్తింపు పొందారు.

## ‘వరవు’(జీ 5) మూవీ రివ్యూ!

మలయాళంలో జోజు జార్జ్ కి మంచి క్రేజ్ ఉంది. యాక్షన్ .. ఎమోషన్ తో కూడిన ఆయన సినిమాలను ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ఆయన నుంచి ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సినిమనే ‘వరవు’. షాయాజీ కైలాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జులై 16వ తేదీన అక్కడి థియేటర్లలో విడుదలైంది. అలాంటి ఈ సినిమా సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ‘జీ 5’లో స్ట్రీమింగ్ అవుతోంది. రీసెంటుగా తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.

పాల్సన్ (జోజు జార్జ్) సెంట్రల్ జైలు నుంచి ‘పెరోల్’పై బయటికి వస్తాడు. కోర్టు అతనికి 10 రోజులు మాత్రమే సమయం ఇస్తుంది. ఈ లోగా తాను చేయవలసిన పనులు పూర్తి చేయాలనే కసితో అతను ఉంటాడు. అతని అక్కయ్య ‘డైసీ’ (సుకన్య) నన్ గా ఉంటుంది. తమ్ముడు ‘విల్సన్’ (అర్జున్ అశోకన్) కనిపించకుండాపోయి నాలుగేళ్లు అవుతూ ఉంటుంది. వాళ్లిద్దరి గురించి అతను ఎక్కువగా ఆలోచన చేస్తుంటాడు. అతనికి తోడుగా స్నేహితులైన సేతు - పాపన్ ఉంటారు. పాల్సన్ .. డైసీ .. విల్సన్ ఈ ముగ్గురూ కూడా తమ చిన్నతనంలోనే ‘సెభాన్’ (దీపక్ పరాంబోల్)ను చేరదీస్తారు. అయితే అతను రాజకీయంగా ఎదిగి ఇప్పుడు ఎమ్మెల్యేగా చక్రం తిప్పుతుంటాడు. ఆ ప్రాంతంలో అన్యాయాలకు .. అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ గా ఉన్న ‘కొచ్చాటన్’ చేతిలో పావుగా మారిపోతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ లో ఉండే ‘స్కారియా’ కూడా ‘కొచ్చాటన్’ కోసమే తన అధికారాలను ఉపయోగిస్తూ ఉంటాడు. అతనికి అనుకూలంగా పనిచేస్తూ ఉంటాడు. ‘కొచ్చాటన్’ కూతురే ‘లిషా’.

పాల్సన్ తమ్ముడు విల్సన్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కాలేజ్ లోనే ‘లిషా’ చదువుకుంటూ ఉంటుంది. ఇద్దరూ ప్రేమించుకుంటూ ఉంటారు. ఆ ఊరు నుంచి పారిపోతారు. తన పరువు ప్రతిష్ఠలను బజార్లో పడేసిన విల్సన్‌పై కొచ్చాటన్ మండిపడతాడు. వాళ్లిద్దరి ఆచూకీ తెలుసుకుని, తన కూతురును ఇంటికి తీసుకుని వెళతాడు. అప్పటి నుంచి విల్సన్ ఆచూకీ తెలియదు. తన తమ్ముడు కనిపించకుండా పోయిన విషయంలో కొచ్చాటన్ .. సెభాన్ .. స్కారియాపై పాల్సన్ కి అనుమానం ఉంటుంది. పెరోల్ పై వచ్చిన ఆయన ఏం చేస్తాడు? ఎలా ప్రతీకారం తీర్చుకుంటాడు? అనేదే కథ.

‘వరవు’ అంటే మలయాళంలో ‘రావడం’ అనే అర్థం ఉంది. అంటే హీరో జైలు నుంచి ‘పెరోల్’ పై రావడం .. లేదంటే నాలుగేళ్ల క్రితం ఊరు నుంచి పారిపోయిన హీరో తమ్ముడు తిరిగి రావడం అనే సందర్భాలు మనకి ఈ కథకి తగినట్టుగా కనిపిస్తాయి. తన తమ్ముడికి జరిగిన అన్యాయానికి ఒక అన్నయ్య ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడనే దిశగా ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. అయితే ఈ ప్రతీకారం తీర్చుకునే విషయంలో ఒక కొత్త కోణం ఉంది. అయితే ఆ పాయింటు కూడా ఆల్రెడీ ఇంతకుముందు టచ్ చేసినదే.

డబ్బు .. పలుకుబడి .. అధికారం .. ఈ మూడు ఏకమైతే, సామాన్యుల జీవితాలను బలి తీసుకునే ఆలోచనలు చేస్తాయి. ఈ మూడు శక్తులు ఏకమై నిలబడితే సామాన్యులు ఎదురువెళ్లలేరు .. ఏమీ చేయలేరు అనే ధీమా అరాచక శక్తులకు ఉంటుంది. అలాంటి వాళ్లకి ఒక సామాన్యుడి ప్రతీకారం ఎలా ఉంటుందనేది చూపించే కోణంలో దర్శకుడు ఈ కథను నడిపించాడు.

ఈ కథ అంతా కూడా జోజు జార్జ్ చుట్టూనే తిరుగుతుంది. నెగెటివ్ షేడ్స్ కలిగిన మిగతా పాత్రలు తెరపై అక్కడక్కడా .. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. ఒక బడా వ్యాపారీ .. ఒక రాజకీయనాయకుడు .. ఒక పోలీస్ ఆఫీసర్ ఈ కథలో విలన్స్‌గా కనిపిస్తారు. అయితే మలయాళ సినిమాల సహజ లక్షణంగా .. వాస్తవానికి దగ్గరగా ఈ కథ కదులుతుంది. ఎక్కడా కూడా ‘అతి’ అనేది కనిపించదు. పరిస్థితులకు తగినట్టుగా మారిపోవడమే కనిపిస్తుంది.

ఈ కథలో హీరో తమ్ముడి ప్రేమవ్యవహారం చాలా కీలకం. కథను మలుపు తిప్పే అంశం ఇదే. అలాంటి ఈ అంశానికి పెద్దగా ప్రాముఖ్యతను ఇవ్వకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. కథ .. కథనం .. చిత్రీకరణ .. ఇవన్నీ కూడా బోర్ అనిపించకుండా సాగిపోతూనే ఉంటాయి. కాకపోతే గతంలో వచ్చిన ఈ తరహా కథల అడుగుజాడలలోనే ఈ కథ కూడా నడవడం ఇబ్బందిని కలిగిస్తుంది.



జోజు జార్జ్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఆయన తరువాత ప్రభావితం చేసే స్థాయిలో మిగతా పాత్రలేవీ కనిపించవు. శరవణన్ ఫొటోగ్రఫీ .. సామ్ సీఎస్ నేపథ్య సంగీతం .. ఆకట్టుకుంటాయి. షమీర్ మహ్మద్ ఎడిటింగ్ ఫరవాలేదు.

కర్మ ఫలితం ఎవరినీ వదిలిపెట్టదు. నువ్వు మంచి చేసినా .. చెడు చేసినా దాని ఫలితాన్ని ముట్టజెప్పడానికి అది నిన్ను వెంటాడుతూనే ఉంటుంది అనే సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.

### సినిమా వివరాలు

సినిమా పేరు: వరవు
జానర్: యాక్షన్, థ్రిల్లర్
విడుదల తేదీ: 2026-09-11
తారాగణం: జోజు జార్జ్, అర్జున్ అశోకన్, సానియా అయ్యప్పన్, మురళీ గోపీ, బైజు సంతోష్, వాణీ విశ్వనాథ్, బాబీ కురియన్
దర్శకుడు: షాజీ కైలాస్
సంగీతం: సామ్ సి ఎస్
బ్యానర్: ఓల్గా ప్రొడక్షన్స్
సమీక్ష: పెద్దింటి
వరవు రేటింగ్: 5కి 1.75

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662